
www.kalamjyothi.com
కలంజ్యోతి
రేపటి కోసం
గురువారం
08 మే 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# వంద మంది ముష్కరుల హతం



## 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత్ ముప్పేట దాడి

- పీవోకే, పాక్ లోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు
- బుధవారం అర్ధరాత్రి 1.051.30 నడుమ ఆపరేషన్ పూర్తి
- 25 నిమిషాల్లో 9 ఉగ్ర స్థావరాలు మటాష్
- ప్రత్యక్షంగా పర్యవేక్షించిన ప్రధాని మోదీ
- లష్కరే, జైషే, హిజ్బుల్ స్థావరాలు ధ్వంసం
- దాడులు ధ్రువీకరించిన పాకిస్థాన్
- విదేశాంగశాఖ, రక్షణశాఖ సంయుక్త మీడియా సమావేశం
- పాక్ ప్రతి దాడులు చేయొద్దన్న అమెరికా
- ప్రతి దాడి తప్పదన్న ప్రధాని షెహబాద్ షరీఫ్
- పాక్ కాల్పుల్లో 15 మంది భారత పౌరుల మృతి

**కలంజ్యోతి ప్రతినిధి :** మన ఆడబిడ్డల శోకానికి... చిన్నారుల ఆక్రందనలకు.. కుటుంబాల గుండెకోతకు..సమాధానం దొరికింది.! పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ బలగాలు సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించాయి. మూకుమ్మడిగా క్షిపణులతో లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. ఫలితంగా 100 మంది ముష్కరులు హతమయ్యారు. పాక్ లోని 9 ఉగ్రస్థావరాలపై భారత్ ఏక కాలంలో దాడులకు దిగింది. దాయాది దేశంలో వంద కి.మీ. లోపలికి చొచ్చుకుపోయి మరీ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. పాక్ లో నాలుగు ఉగ్ర స్థావరాలు, పీవోకేలోని ఐదు ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి టెర్రరిస్టులను కకావికలం చేసింది. భారత్ బుధవారం అర్ధ రాత్రి అర్ధరాత్రి 1.051.30 నడుమ మధ్య త్రివిధ దళాలు ఈ ఉగ్రస్థావరాలపై విరుచుపడ్డాయి. బలగాలు 25 నిమిషాల్లో అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసుకుని భారత్ కు సురక్షితంగా తిరిగి వచ్చాయి. ఈ ఆపరేషన్ ప్రధాని మోదీ వార్ రూమ్ లో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆపరేషన్ 'సింధూర్ ' పూర్తయిన వెంటనే రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. పీవోకేలోని 9 ఉగ్రస్థావరాలను నాశనం చేశామని పేర్కొంది. దాడుల్లో లష్కరే, జైషే, హిజ్బుల్ స్థావరాలు ఉన్నట్టు వెల్లడించారు. ఈ ఉగ్ర క్యాంపుల నుంచి పెద్ద ఎత్తున భారత్ పై పాక్ ఉగ్రవాదులను పంపిస్తూ దేశంలో అల్లకల్లోలం సృష్టించాలనే దుష్టపన్నాగంతో ఉన్నదని పేర్కొంది. దాంతో ఉగ్రస్థావరాలను నాశనం చేసినట్టు తెలిపారు. భారత్ చేసిన ఈ దాడులు మానవత్వాన్ని కాపాడేందుకే అని వెల్లడించింది. ప్రపంచంలో శాంతి స్థాపనతో ముందుకు వెళ్లాలంటే ఉగ్రవాదం ఆటంకంగా మారిందని తెలిపింది. ఇది భారత్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నందున తాము ఈ చర్యలు తీసుకున్నామని రక్షణ మంత్రిత్వ శాఖ ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. భారత్ ప్రకటన అనంతరం పాక్ ప్రకటన వెలువడింది. పాక్ ప్రకటనలో భారత్ ఆరు చోట్ల 24 దాడులు నిర్వహించిందని

మిగతా 2లో

# వందమంది ముష్కరుల హతం

**మొదటిపేజీ తరువాయి**

తెలిపింది. ఈ దాడుల్లో 8 మంది మృతి చెందగా 33 మందికి గాయాలయ్యాయని స్పష్టం చేసింది.

**విదేశాంగశాఖ, రక్షణశాఖ సంయుక్త మీడియా సమావేశం**

విదేశాంగశాఖ, రక్షణశాఖ సంయుక్త మీడియా సమావేశం నిర్వహించింది. ఉగ్ర ఘటనలపై మీడియా సమావేశంలో వీడియో ప్రదర్శించింది. ఈ మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. 'పహల్గామ్ దాడి పిరికిపంద చర్య. అమాయక ప్రజలను వారి కుటుంబాల ముందే చంపారు. ప్రజల తలలపై కాల్పులు జరిపారు. ఈ దాడి సందేశాన్ని వ్యాప్తి చేయాలని ప్రాణాలతో బయటపడిన వారిని హెచ్చరించారు. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధిని దెబ్బతీసేందుకు ఈ దాడి చేశారు. ఈ దాడికి టీఆర్ఎఫ్ బాధ్యత వహించింది. దాడి వెనుక లష్కర్ ఎ తోయిబా ఉన్నట్లు దర్యాప్తులో స్పష్టం అయింది. దాడి అనంతరం భారత ప్రభుత్వం పాక్ తో సంబంధాల పట్ల పలు చర్యలు తీసుకున్నది. పాక్ లోని ఉగ్రవాదులు భారత్ లో మరిన్ని దాడులకు తెగబడే అవకాశం ఉన్నది. ఈ దాడులను ఆపేందుకు భారత్ నిర్ణయించింది. తమ హక్కును ఉపయోగించుకుని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశాం. పహల్గామ్ ఉగ్రచర్యకు బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఐక్యరాజ్యసమితి కూడా ఆందోళన వ్యక్తం చేశాం. పాకిస్తాన్ గతంలో జరిగిన ఉగ్రదాడులపై కూడా ప్రపంచ వేదికలను తప్పు దారి పట్టించింది. సాజిద్ మీర్ కేసులో పాకిస్తాన్ ఉగ్రవాది చనిపోయినట్లు ప్రకటించింది కానీ అతను సజీవంగా చిక్కడంతో పాక్ వి అసత్యాలేనని ప్రపంచానికి తెలిసి వచ్చింది. దాంతో ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. బుధవారం చేపట్టిన ఈ క్షిపణి దాడుల్లో ఉగ్రవాదులు భారీ నష్టాన్ని చవిచూశారు. భారత్ ఇక ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోదని సందేశాన్నిచ్చినట్లయ్యింది. అదే సమయంలో భారత్ ఉగ్రవాదులపైనే దాడి చేసింది. పాక్ పై ఎలాంటి దాడులకు పాల్పడలేదు 'అని అన్నారు.

**21 స్థావరాలను గుర్తించాం..**
**9 ప్రాంతాలను టార్గెట్ చేశాం..**

'ఆపరేషన్ సిందూర్' జరిపిన తీరును కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. "జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. గత 30ఏళ్లుగా పాకిస్థాన్ టెర్రరిస్టులను సౌకర్యాలు కల్పిస్తున్నది. ఆ దేశంతో పాటు పీఓకేలోనూ టెర్రరిస్ట్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇంటెలిజెన్స్ సమాచారం సాయంతో మొత్తం 21 స్థావరాలను గుర్తించాం. అందులో 9 ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నాం. మేము కేవలం



ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశాం. పాకిస్థాన్ పౌరులకు హాని చేయకుండా వీటిని నిర్వహించాం. ఆర్మీ శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మే6, 7 అర్ధరాత్రి 1.051.30 గంటల మధ్య ఆపరేషన్ సిందూర్ జరిగింది. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో లాహోర్‌కు 40కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో గల లష్కరే తోయిబా కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పలడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ట్రైనింగ్ తీసుకున్నారు" అని కర్నల్ సోఫియా ఖురేషి తెలిపారు.

**చరిత్రలో తొలిసారి మహిళా అధికారులు**

అధికారులు ఈ ఆపరేషన్ సిందూర దాడుల తీరును వివరిస్తుండగా, దాడులు వీడియో ప్రజెంటేషన్‌ను మీడియాకు ప్రదర్శించారు. సమావేశానికి ముందు గతంలో భారత్ జరిపిన దాడుల వీడియోలను ప్రదర్శించారు. ఇంకా ప్రత్యేకంగా చరిత్రలో తొలిసారి మహిళా మిలిటరీ అధికారులతో ఆపరేషన్ వివరాలని వెల్లడించడం విశేషం. ఆపరేషన్ సిందూరం పేరుకు న్యాయం చేకూర్చే క్రమంలోనే మహిళా అధికారులతో వివరాలు వెల్లడించినట్టు సైన్యం వెల్లడించింది.

**ప్రతి దాడి తప్పదు: పాక్ ప్రధాని షెహబాద్**

భారత్ దాడులు యుద్ధ చర్యల్లో భాగమేనని పాకిస్థాన్ ప్రధాని షెహబాద్ షరీఫ్ అన్నారు. "మోసపూరిత శత్రువు.. పాక్‌లోని 5 ప్రాంతాల్లో దాడులు చేసింది. ఈ చర్యలకు పాక్ కచ్చితంగా బదులు తీర్చుకుంటుంది. ఈ సమయంలో పాకిస్థాన్ సైన్యం వెంట దేశమంతా ఉన్నది. శత్రువును ఎలా ఎదుర్కోవాలో పాక్, ఆర్మీకి తెలుసు. ప్రత్యర్థి దుష్ట ప్రణాళికలను ఎట్టి పరిస్థితుల్లోనూ నెరవేరనీయం" అని 'ఎక్స్'లో అన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై చేసిన దాడులను ఆ దేశం ధ్రువీకరించింది. దానిపై పాక్ డీజీ ఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరీ కూడా ఈ ఘటనపై స్పందించారు. పాకిస్థాన్‌లోని కొట్లీ, మురిద్కే, బహవల్పూర్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్లు వెల్లడించారు. . ఈ దాడుల్లో ముగ్గురు చనిపోయారని, 12 మందికి గాయాలైనట్టు పాక్ ఆర్మీ తెలిపింది. సమయం చూసుకుని బదులుగా స్పందిస్తామని చెప్పారు. భారత్ తాత్కాలిక ఆనందాన్ని శాశ్వత దుఃఖంతో భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికారు. పాక్ ప్రధాని వారి త్రివిధ దళాల అధిపతులతో సమావేశమయ్యారు. హైలెవల్ మీటింగ్ లో భారత్ పై యుద్ధం చేయాలని ఆదేశించినట్టు సమాచారం.

**బార్డర్‌లో టెన్షన్ టెన్షన్!**


పాకిస్థాన్ ప్రధాని ప్రకటన తర్వాత ఎల్ ఓసీ వెంబడి పూంచ్, రాజౌరి సెక్టార్లలో పాక్ ఆర్మీ కాల్పులకు తెగబడింది. దాంతో భారత్ సైన్యం కూడా దీటుగా కాల్పులు ప్రారంభించింది. ఫలితంగా సరిహద్దుల్లో ఉద్రక్త వాతావరణం నెలకొంది. దాడులు జరిగిన ప్రాంతాల్లో మురిద్కే టెర్రరిస్టు గ్రూప్ లష్కరే తోయిబాకు కేంద్రంగా ఉంది. ఇక పాక్ పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్పూర్‌లో మసూద్ అజార్ నేతృత్వంలోని జైష్ఎ మహ్మద్ హెడ్ క్వార్టర్స్ ఉన్నది.

**ఎక్కడికక్కడ అలర్ట్**

భారత్ చేసిన మెరుపు దాడులతో పాకిస్థాన్ అప్రమత్తమైంది. లాహోర్ , సియాల్‌కోట్ విమానాశ్రయాలను 48గంటల పాటు మూసివేసినట్లు సమాచారం. మరోవైపు, దాడుల తర్వాత భారత్ కూడా అలర్ట్ అయింది. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ అమెరికా ఎన్ఎస్ఏ మార్కో రూబియోతో మాట్లాడారు. దాడుల వివరాలను ఆయనకు వివరించారు. భారత్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ అలర్ట్ అయ్యాయి. పాక్ ఎలాంటి దుస్సాహసానికి దిగినా నిలువరించేందుకు బార్డర్ వెంటనే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఆర్మీ మోహరించింది

**పాక్ కాల్పుల్లో**
**15 మంది భారత పౌరులు మృతి**

కొద్ది రోజులుగా సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంట పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నది. పహల్గామ్ ఉగ్రదాడికి బదులుగా పాక్ ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' పేరుతో మెరుపు దాడులు చేపట్టింది. దాంతో బుధవారం కూడా పాక్ రేంజర్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 15 మంది భారత పౌరులు మృతి చెందగా.. 43 మంది గాయపడినట్లు భారత ఆర్మీ వెల్లడించింది. పూంఛ్, తంగ్ధర్ సెక్టార్లలో గత రాత్రి నుంచి పాక్ బలగాల కాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొంది. సాధారణ నివాస ప్రాంతాలే లక్ష్యంగా పాక్ బలగాల కాల్పులకు పాల్పడుతున్నది.



## ఏయే ప్రాంతాల్లో దాడులు..

1. బహవల్పూర్ అంతర్జాతీయ సరిహద్దు నుంచి100 కి.మీ దూరంలో ఉన్న జైష్ -ఎ -మహ్మద్ ప్రధాన కార్యాలయాన్ని కూల్చివేశాయి.
2. మురిడ్కే ఈ ఉగ్రవాద స్థావరం అంతర్జాతీయ సరిహద్దు నుంచి 30 కి.మీ దూరంలో ఉంది. 26/11 ముంబాయి దాడులతో సంబంధం ఉన్న లష్కరే తోయిబా శిబిరాన్ని ధ్వంసం చేసింది.
3. గుల్పూర్ ఈ ఉగ్రవాద స్థావరం ఎల్ఓసీ (పూంచ్-రాజౌరి) నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది.
4. లష్కర్ క్యాంప్ సవాయి ఈ ఉగ్రవాద స్థావరం పీవోకేలోని కశ్మీర్ తంగ్ధర్ సెక్టార్ లోపల 30 కి.మీ దూరంలో ఉంది. దీనిపై బాంబుల వర్షం కురిపించారు.
5. బిలాల్ క్యాంప్ - జైష్ -ఎ -మొహమ్మద్ లాంచ్‌ప్యాడ్. ఈ రహస్య స్థావరం ఉగ్రవాదులను సరిహద్దు దాటించడానికి ఉపయోగించేవారు. దీనిపై భారత్ భారీ ఎత్తున బాంబుల వర్షం కురిపించింది.
6. కోట్లి – లష్కర్ శిబిరం ఎల్ఓసీ నుంచి కేవలం 15 కి.మీ దూరంలో ఉంది. ఇది 50 మందికి పైగా ఉగ్రవాదులకు వసతి కల్పించే సామర్థ్యం ఉన్న రహస్య స్థావరం కావడంతో దీన్ని పూర్తిగానే నేలమట్టం చేశారు.
7. బర్నాలా క్యాంప్ ఈ ఉగ్రవాద స్థావరం ఎల్ఓసీ నుంచి 10 కి.మీ దూరంలో ఉంది. పహల్గామ్ దాడి ఉగ్రవాదులు ఇక్కడి నుంచి వచ్చినట్లుగా కూడా ఇంటలిజెన్స్ భావించింది. దీంతో ఈ స్థావరాన్ని ధ్వంసం చేశారు.
8. సర్జల్ క్యాంప్ జైష్ శిక్షణా కేంద్రం సాంబా-కతువా ఎదురుగా అంతర్జాతీయ సరిహద్దు నుంచి 8 కి.మీ దూరంలో ఉంది. ఈ క్యాంపులో అనేకమంది యువకులకు ఉగ్రశిక్షణ కొనసాగుతుంది.
9. మెహమూనా క్యాంప్ (సియాల్‌కోట్ సమీపంలో)– ఇది హిజ్బుల్ ముజాహిదీన్ శిక్షణా శిబిరం, అంతర్జాతీయ సరిహద్దు నుంచి15 కి.మీ దూరంలో ఉంది. దీనిపై కూడా భారత వైమానిక దళాలు విరుచుపడ్డాయి.



# భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రభుత్వ భూములను ఆక్ర మించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. ఈ మే రకు ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పలు మండలాల్లో ఆక్రమ ణకు గురైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని కబ్జా చేసిన ప్రభుత్వ భూము లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలి పారు. గత ఆరు నెలలుగా జిల్లాలోని వివిధ మండ లాల్లో నిర్వహిస్తున్న ఆక్రమణల గుర్తింపు ప్రక్రి యలో భాగంగా ఈ భూములు వెలుగులోకి వచ్చా యని తెలిపారు. నిర్మల్ గ్రామీణ మండలంలో 35.03 ఎకరాలు (రూ.5.77 కోట్లు), భైంసా మండలంలో 18.31 ఎకరాలు (రూ.2.07 కోట్లు), నర్సాపూర్(జి) మండలంలో 16 ఎకరాలు (రూ.2.04 కోట్లు), లోకేశ్వరం మండలంలో 12.25 ఎకరాలు (రూ.1.34 కోట్లు) మొత్తం 82 ఎకరాలు అన్యాక్రాంతమైన కోట్లాది విలువైన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకు న్నామని కలెక్టర్ తెలిపారు. ఆక్రమణదారులపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామ న్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల గుర్తింపు ప్రక్రియ పలు మండలాలోని 260 ఎకరాలలో కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రెవెన్యూ, అటవీ భూములు, చెరువు శిఖం భూము లు, సాగునీటి ప్రాజెక్టుల కాలువలు తదితర భూములను అక్రమంగా ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా లో ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగి స్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఉద్యోగులు, పెన్షనర్లపై సీఎం వ్యాఖ్యలు అవమానకరం

### వారిని విస్మరిస్తే గత అనుభవాలు ఖాయం

### అఖిల భారత పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి లింగన్న




**కలంజ్యోతి, నిర్మల్ :** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన ర్లను అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య లు చేయడం బాధాకరమని అఖిల భారత పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు సీఎం స్థాయికి తగవని, ఉద్యోగుల మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయని ఆయన నిరసన వ్యక్తం చేశా రు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు వ్యతిరేకంగా పని చేసిన ప్రభుత్వాలను ఇంటికి పంపినా విషయం మరువరాదని ఆయన అన్నారు. నిర్మల్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్ని కల మ్యానిఫెస్టోలో తమకు న్యాయంగా రావా ల్సిన సౌకర్యాలను అడగటమే తాము చేసిన నేర మా? అని ప్రశ్నించారు. రెండేళ్లుగా పదవీ విర మణ పొంది, రిటైర్మెంట్ ప్రయోజనాలు అందక మనోవేదనకు గురవుతున్న వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయటం బాధాకరమన్నారు. చివరికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ సర్వీస్ కాలంలో పొదుపు చేసిన పీఎఫ్ బకాయిలు కూడా ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. ఒకవైపు రిటైర్మెంట్ ప్రయోజనాలు అందక, పిల్లల వివాహాలు చేయ లేక, అనారోగ్య పరిస్థితులకు లోనై పలువురు రిటై ర్డ్ ఉద్యోగులు మృతి చెందారని ఆవేదన వెలిబు చ్చారు. ఇదిలా ఉంటే దాదాపు 35 నుంచి 40 సం వత్సరాల పాటు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల కు చేర్చటంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగుల కు నగదు రహిత వైద్య సేవలు అందించలే కపోవటం దురదృష్టకరమన్నారు. ప్రజల కోసం, ప్రజల్లో ఒకరిగా పని చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను ప్రజల నుంచి వేరు చేసేలా వ్యాఖ్యలు చేస్తూ విభజించి పాలించు అన్న ధోరణి అవలంభి స్తున్నారని విమర్శించారు. గతంలో ఉద్యోగ వ్యతి రేక ధోరణి అవలంభించిన ప్రభుత్వాలకు ఎదురైన అనుభవాలు పునరావృతం అవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ హన్మంత్ రెడ్డి, పి విలాస్, లోలం గంగన్న తదితరులు పాల్గొన్నారు.



## సిందూర్ విజయోత్సవ వేడుకలు

**కలంజ్యోతి, నిర్మల్ :** కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ వైమానిక దాడులు చేయడాన్ని హర్షిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పహల్గాం దాడికి భారత్ సైన్యం ప్రతీకారం తీర్చుకోవడం హర్షణీయమని అన్నారు. భారత సైన్యానికి, నరేంద్ర మోడీకి అందరం అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రామనాథ్, మెడిసిమ్మె రాజు, అలివేలు మంగ, కమల్ నయన్, రాచకొండ సాగర్, ఒడిసేల అర్జున్, రజనీ వైద్య, ఆకుల కార్తీక్, సాదం అరవింద్, దశరథ్ పోశెట్టి, సుధాకర్, అయ్యన్నగారి రాజేందర్ తదితరులు ఉన్నారు.

## సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంస్థాగత మద్దతు

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంస్థాగత మద్దతు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు మద్దతుతో ఎం ఎస్ ఎం ఈ క్రింద తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాలలోని జిల్లా పరిశ్రమల కేంద్రాలలో ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని, తద్వారా మార్కెట్ యాక్సిస్, క్రెడిట్ లభ్యత, పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన వ్యక్తుల నుండి ఒక మేనేజర్, ఒక అసిస్టెంట్ మేనేజర్ లను ప్రతి జిల్లాకు నియమించేందుకు దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మేనేజ్మెంట్/కామర్స్, ఇంజనీరింగ్ నేపథ్యంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు ప్రాధాన్యత ఉంటుందని, అర్హత, ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆన్లైన్లో www.nimsme.gov.in వెబ్ సైట్ లో, జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎస్ 25 లో గల జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.



## క్రీడాశిక్షణ శిబిరాలకు క్రీడా కిట్లు

**కలంజ్యోతి, మంచిర్యాల :** వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని, క్రీడాకారులు ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖాధికారి కీర్తి రాజ్ వీరు తో కలిసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు అందించిన క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సందర్భంగా ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఖే లో ఇండియా సెంటర్ బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేష్, ఫుట్బాల్, వాలీబాల్, కరాటే శిక్షకులు వనిత, పున్నం చందు, రవి పాల్గొన్నారు.



## భూమాత సల్లంగా చూడమ్మా..

**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల జిల్లాలో సోమవారం సాయంత్రం 15 సెకన్లు పాటు భూమి కంపించడంతో ప్రజలు ఇండ్ల నుండి బయటికి పరుగులు తీశారు. ఇలా జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురైయ్యారు. ఈ సందర్భంగా మల్యాల మండల కేంద్రంలోని ప్రజలు మళ్ళీ భూకంపం రాకుండా ఉండాలని 5 బూరెలు తయారు చేసి, భూమిని తవ్వి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భూమాతకు బూరెల నైవేద్యం సమర్పించారు. 'చల్లంగా చూడామ్మా భూమాత' అని నమస్కరించి చిన్నారులు వేడుకొన్నారు. ఇలా చేయడం ద్వారా 'భూమాత' శాంతిస్తుందని పెద్దవారు తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణ



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 219 కేంద్రాలు ద్వారా 6,322 మంది రైతుల వద్ద నుంచి 50,707 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### అన్నదాతలకు అవగాహన కార్యక్రమం




**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ముత్యం పేట గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డా.ఇ. రజినీకాంత్, అగ్రోనోమి శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. రైతులకు సాగు నీటి యాజమాన్యం, పంట మార్పిడి మరియు చెట్లను పెంచడం హార్యవరణాన్ని కాపాడడం మొదలగు అంశాల మీద అవగాహన కల్పించారు. 'వరి పంటలో నీటితడులు పంట ఏఏ దశలలో ఇస్తే అధిక దిగుబడులు సాధించి నీటిని ఆదా చేయొచ్చు' అనే అంశం మీద రైతులకు వివరించారు. పంట మార్పిడి చేయడం వలన చేకూరే లాభాలను, పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా చెట్లు పెంచడం ద్వారా పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడవచ్చు అని అంశాల మీద



అవగాహన కల్పించారు. డా. ఎన్ సాయినాథ్, మృత్తిక శాస్త్రవేత్త, జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాఖ మాట్లాడుతూ.. రైతులకు యూరియా, ఇతర ఎరువుల వాడకం, తెగుళ్లు పురుగు మందుల వాడకం, రశీదు తీసుకోవడం, విత్తన శుద్ధి చేసుకోవడం మొదలగు అంశాల మీద అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్ రైతులు వరి మొక్కజొన్న పంటలనే కాకుండా పామాయిల్ పంటను వేసుకోవడం వల్ల అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. లోహియా కంపెనీ ప్రతినిధి ఎన్ అనిల్ కుమార్ ఆయిల్ ఫామ్ పంట గురించి, ప్రభుత్వ రాయితీ గూర్చి వివరించడం జరిగింది. ఆ తర్వాత హాజరైన రైతులచే పీజేటీఏయూ యూట్యూబ్ ఛానల్ సబ్స్క్రిప్షన్ చేయించడం జరిగింది. ఆదర్శ రైతు కోలా గంగాధర్ వాన కాలములో సాగుకు అనువైన సన్న గింజ వరి రకాలు కావాలని, యాసంగిలో ముగి పురుగు అగ్గి తెగులు నివారణలు చేపట్టవలసిన చర్యల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు. చివరగా గ్రామపంచాయతీ ఆవరణలో ఉసిరి చెట్లు నాటి కార్యక్రమంతో ముగించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎన్ కారుణ్య కుమార్, మంజుల, బద్దం తిరుపతిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, దారం ఆదిరెడ్డి, మ్యాక లక్ష్మణ్, కె సుదర్శన్ రెడ్డి, పైడిపల్లి అజయ్, స్వామి, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఉదయ్ సాయి, స్నిగ్ధ, నాగేశ్వర్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ ఫలాలు అందరికీ అందడం లేదు

### దరువు అంజన్న



**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** భారత రాజ్యాంగము ఆవశ్యకతపై తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కలాల గళాల వేదిక చైర్మన్ దరువు అంజన్న ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ జిల్లాల కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 'రాజ్యాంగం ఆవశ్యకత' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహిస్తున్న కవి, గాయకులు దరువు అంజన్నను అభినందించారు. రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలు, జరిగితే సమానత్వం, సౌభ్రాతృత్వంతో కలిసి మెలిసి ఉండేవారన్నారు. కార్యక్రమంలో కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు, పాశం యాదగిరి, బత్తుల సిద్దేశ్వర్ పటేల్, ఆస్కాని మారుతి సాగర్, సుప్రజ హాస్పిటల్ డైరెక్టర్ విజయ్, జిలకర శ్రీనివాస్, సొంటిరెడ్డి పున్నారెడ్డి, గడ్డమీది బాల్ రాజ్, 1 ఉమా మహేష్, తెలంగాణ శ్యామ్ , జర్నలిస్ట్ సుగ్రీవుడు, చిరుమర్తి రాజు, బైరాగి మోహన్, రాచకొండ రమేష్, విశ్వనాధుల పుష్పగిరి, మల్లేష్, అంజి బాబు, జర్నలిస్ట్ భాస్కర్, జర్నలిస్ట్ సాయి, యాసాల బాలరాజ్ సాయిరాజ్, ప్రసన్న అక్క, అరుణ బంగారు, అనురాధ గౌడ్, పద్మజ రెడ్డి, అరుణ ఉపద్రాష్ట, కవులు, కళాకారులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు రాజ్యాంగంపై రాజ్యాంగ విలువలపై పాడిన పాటలు సభికులను ఆలోచింపజేశాయి.



# ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలి

### కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలు



**కలంజ్యోతి, మల్యాల :** పాకిస్తాన్ ఉగ్రవాదులపై భారత్ మొదలు పెట్టిన యుద్ధం విజయవంతం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన సైనికులకు దేశ ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం కలగకూడదని, ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని, పాకిస్తాన్ కి బుద్ధి చెప్పే విధంగా ఇండియన్ ఆర్మీ సోల్జర్స్ ముందడుగు వేసిన తీరు గర్వకారణన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షాకు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మాజీ ఎంపీటీసీ కొల్లూరు గంగాధర్, కిల్లేటి రమేష్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, యాగండ్ల లక్ష్మీనారాయణ, కోను శ్రీనివాస్, నులుగొండ సురేష్, పిల్లి రాజశేఖర్, పొన్నం సాయికుమార్, సామ మైపాల్, మల్లేశంయాదవ్, హరీష్, ఆనందం, సంతోష్, గంగాధర్, శ్రీధర్ గౌడ్, హర్షవర్ధన్, గౌతమ్, సాయి, నీలం రవి, రుత్త కిషన్, ముత్యాల మధు, పరశురాములు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం



### ఎమ్మెల్యే సత్యం

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ముత్యంపేట పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. రైతులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ముత్యపు శంకర్ గౌడ్, ఆనంద రెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ప్రకాష్ రెడ్డి సంత, శనిగారపు తిరుపతి, నేరెళ్ళ సతీష్ రెడ్డి, కొండబత్తిని అనిల్ కుమార్, తాళ్ల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# అడవులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు

### బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానన్

**కలంజ్యోతి, నిర్మల్ :** అడవికి నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లడంతో పాటు అడవి జంతువులు ఇబ్బందులకు గురవుతాయని బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానన్ అన్నారు. బుధవారం నిర్మల్ సిసిఎఫ్ కార్యాలయంలో ఎఫ్డిఓ నాగిని భాను, నిర్మల్ ఎఫ్ఆర్ఓ రామకృష్ణారావులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావాలనే కొందరు వ్యక్తులు అడవికి నిప్పు పెడుతున్నారని తద్వారా వన్యప్రాణులు ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. అడవులకు నిప్పు పెడితే అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవికాలంలో వన్యప్రాణులకు తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామపంచాయతీలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నట్లు వివరించారు. చించోలి పార్కు సందర్శకుల సంఖ్యను పెంచి ఆదాయం వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దిమ్మదుర్తి తుర్కం చెరువు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకుల సంఖ్యను పెంచుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తుర్కం చెరువు వద్ద కాటేజీలు ఏర్పాటు చేసి పర్యాటకులు బస చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేలా సఫారీ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని వివరించారు. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా జీవించే వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేటు వాహనాలను అడవిలోకి తీసుకెళ్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు.



# డిప్యూటీ కమిషనర్ తో గచ్చిబౌలి కార్పోరేటర్ గంగాధర్ రెడ్డి భేటీ

**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమీషనర్ గా నియమితులైన ప్రశాంతి ని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై డిప్యూటీ కమిషనర్ తో చర్చించడం జరిగింది. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలి పోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని అని కోరారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ, పార్క్ లు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, అభివృద్ధి విషయంలో అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరారు.



## అవాంఛనీయ ఘటనలకు
# తావివొద్దు

- అధికారులకు సీఎం ఆదేశం
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశం
- అత్యవసర ఉద్యోగుల సెలవులు రద్దు

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ అభ్యాస్ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్మీ, పోలీసు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర అత్యవసర విభాగాలతో తాజా పరిణామాలను ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయా విభాగాలకు స్పష్టంగా పలు ఆదేశాలిచ్చారు. మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలని సూచించారు. ఉద్యోగులంతా అందుబాటులో ఉండాలని.. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. వైద్యం, పౌర సరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవల విభాగాలన్నీ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పరిస్థితిని ఆసరా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసే వారి పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని, సైబర్ సెక్యూరిటీ విభాగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**సీసీ కెమెరాల అనుసంధానం...**

రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగవద్దని అన్నారు. అలాగే హైదరాబాద్‌లోని రక్షణ రంగ సంస్థల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన వారికి తగిన రక్షణ కల్పించాలన్నారు. కేంద్ర నిఘా బృందాలతో రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్మీ, పోలీసు, ఇతర అత్యవసర విభాగాలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు. సైన్యానికి మద్దతుగా రేపు సాయంత్రం ర్యాలీ తీయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రేపు సాయంత్రం 6 గంటలకు సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సంఘీభావ ర్యాలీలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.





# మోగిన సైరన్లు

- దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్‌లో అవగాహన
- ప్రజలు అధైర్యపడొద్దు :సీవీ ఆనంద్
- సహాయం కోసం 112 కు ఫోన్ చేయండి



**కలంజ్యోతి, హైదరాబాద్ :** పాకిస్తాన్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ అభ్యాస్'పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మొదట నగరంలో పలు చోట్ల సైరన్లు మోగాయి. హైదరాబాద్ నగరంలో పలు చోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సైరన్లు మోగించారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కోసం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల మాక్‌డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహణ జరిగింది. నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. సివిల్ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, రక్షణ శాఖ, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్ బాగ్ డీఆర్‌డీఓ, మౌలాలి ఎన్ఎఫ్‌సీలో అధికారులు మాక్ డ్రిల్ జరగ్గా.. వైమానిక దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు అవగాహన కల్పించారు. దాదాపు అరగంట పాటు ఈ కార్యక్రమం కొనసాగింది.

**ప్రస్తుత పరిస్థితులపై ప్రజలు భయపడవద్దు.. సీవీ ఆనంద్ సూచన**

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రజలు భయపడవద్దని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సూచించారు. ప్రజలు ఫేక్ వార్తలను నమ్మి భయపడవద్దని సూచించారు. పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఈ మాక్‌డ్రిల్‌ను సీవీ ఆనంద్ పర్యవేక్షించారు. మాక్ డ్రిల్ అనంతరం సీపీ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆపరేషన్ అభ్యాస్ పేరుతో సాయంత్రం 4 గంటలకు మాక్‌డ్రిల్ నిర్వహించామని సీవీ ఆనంద్ తెలిపారు. రెండు నిమిషాల పాటు సైరన్ మోగించి అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. నాలుగు ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగినట్లుగా మాక్‌డ్రిల్ చేశామని చెప్పారు. దాడులు జరిగితే తీసుకునే చర్యలు చేసి చూపించామన్నారు. అగ్నిమాపక, వైద్య సిబ్బంది చేపట్టే చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించామని తెలిపారు. అన్ని శాఖల అధికారుల పనితీరు, స్పందన ఎలా ఉందో ఈ మాక్‌డ్రిల్స్ ద్వారా గుర్తించామని తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, పురపాలక, పోలీసు, అగ్నిమాపక శాఖ, విద్యుత్, రవాణా, ఇతర శాఖల వారంతా ఆయా ప్రాంతాలకు తరలివెళ్లి సహాయక చర్యలు చేపట్టారన్నారు. ఫేక్ వార్తలను నమ్మి భయపడొద్దని సూచించారు. ఏ సహాయం కావాలన్నా 112కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

Cinema

# కలంజ్యోతి

గురువారం 08.05.2025



## రిలేషన్‌షిప్ డ్రామాలు నాకు నచ్చవు

యంగ్ బ్యూటీ కేతిక శర్మ 'రొమాంటిక్' చిత్రంతో సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా పెద్దగా హిట్ అందుకోనప్పటీ.. కేతిక పర్ఫామెన్స్‌కు, ఎక్స్‌పోజింగ్‌కు మంచి మార్కులే పడ్డాయి. దీంతో అవకాశాలు అందిపుచ్చుకుని 'రంగ రంగ వైభవంగా, బ్రో, విజయ్ 69' వంటి చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఈ ఏడాది స్పెషల్ సాంగ్‌లో కూడా మెరిసి అదరహో అనిపించింది. నితిన్ హీరోగా వచ్చిన 'రాబిన్‌హుడ్' చిత్రంలో 'అది దా సర్‌ప్రైజ్' సాంగ్‌లో స్టెప్పులు వేసి వావ్ అనిపించుకున్న కేతిక.. ప్రస్తుతం శ్రీవిష్ణు హీరోగా నిటిస్తున్న 'సింగిల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ఈ నెల 9 థియేటర్స్‌లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే 'సింగిల్' విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు చిత్ర బృందం. ఇందులో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కేతిక శర్మ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'అల్లు అరవింద్ గారి సమర్పణలో ఓ మూవీ చేయాలని ఎప్పటినుంచో అనుకున్నాను. ఇప్పుడు కుదిరినందుకు చాలా హ్యాపీగా ఉన్నాను. ఇక కెరీర్ పరంగా నేను చాలా హ్యాపీగా ఉన్నాను. ఎందుకంటే హిట్ ఫ్లాప్స్ అనేవి మన చేతిలో ఉండవు. ఓ నటిగా పని చేయడం మాత్రమే నా చేతిలో ఉంది. ఇండస్ట్రీలో కొనసాగడం లక్‌గా భావిస్తున్నాను' అని చెప్పుకొచ్చింది. ఇంకా మాట్లాడుతూ.. 'ప్రస్తుతం నేను సింగిల్ గా ఉన్నాను. రిలేషన్‌షిప్ అంటూ లేనిపోని డ్రామాలు నాకు నచ్చవు' అని తెలిపింది.